పేదల సొంతింటి కల సాకారం: ఎమ్మెల్యే

నిజాంపేట్‌లో ఇందిరమ్మ ఇంటి పనులు ప్రారంభిస్తున్న సంజీవరెడ్డి

కల్హేర్, న్యూస్‌టుడే: పేదల సొంతింటి కలను సాకారం చేయడమే ప్రభుత్వ ధ్యేయమని నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన నిజాంపేట్, బాచేపల్లి, జంబికుంట గ్రామాల్లో భూమిపూజ చేసి ఇందిరమ్మ గృహ నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అర్హులందరికీ ఇళ్లు ఇచ్చే లక్ష్యంతో ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. కార్యక్రమంలో గృహ నిర్మాణ ఏఈ సత్యనారాయణ, ఎంపీడీవో సంగ్రామ్, తహసీల్దార్ నాగజ్యోతి, నాయకులు శంకర్ గౌడ్, రాధాకిషన్, లింగారెడ్డి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

జిన్నారం: మండలంలోని గడ్డపోతారం పురపాలిక పరిధిలోని చౌదరిగూడెంలో కమిషనర్ జైత్రామ్‌నాయక్, మాజీ ఎంపీపీ రవీందర్‌గౌడ్, మేనేజర్ మధుసూదన్‌రెడ్డి తదితరులు ఇందిరమ్మ ఇంటి పనులు ప్రారంభించారు. కొడకంచి, సోలక్‌పల్లి, జిన్నారంలో జరిగిన కార్యక్రమాల్లో ఎంపీడీవో అరుణారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, వడ్డె కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గుమ్మడిదల, న్యూస్‌టుడే: పురపాలిక పరిధిలోని అన్నారం, దోమడుగు, గుమ్మడిదలలో కమిషనర్ రఘు ఇందిరమ్మ గృహాల నిర్మాణాలకు భూమి పూజ చేశారు. మండల పరిధిలోని కొత్తపల్లి, నాగిరెడ్డిగూడెం తదితర గ్రామాల్లో ఎంపీడీవో ఉమాదేవి, రేగోడ్ మండలం టి.లింగంపల్లి గ్రామం1లో మాజీ ఎంపీపీ దిగంబర్‌రావు పర్యవేక్షించారు.

నిధులు లేక.. పనులు సాగక

ఏడీఏ కార్యాలయ భవన నిర్మాణం తీరిది

న్యూస్‌టుడే, జహీరాబాద్

జహీరాబాద్‌లో మూడేళ్ల క్రితం సకల సౌకర్యాలతో కూడిన ఏడీఏ కార్యాలయ నూతన భవన నిర్మాణ పనులను రూ.50 లక్షలతో ప్రారంభించారు. కానీ నేటికీ పూర్తి కాలేదు.

డివిజన్‌లోని అయిదు మండలాల పరిధిలో 76 వేల మంది రైతులున్నారు. 2.20 లక్షల ఎకరాల భూమి ఉంది. 40 మంది సిబ్బంది పనిచేస్తుంటారు. 32 రైతు వేదికల పర్యవేక్షణతో పాటు విత్తనాలు, ఎరువుల పంపిణీ తదితరాల కోసం జహీరాబాద్‌లో వ్యవసాయ సహాయ సంచాలకుల కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు.

ఒకే గదిలోనే అన్నీ..

50 ఏళ్ల క్రితం అప్పటి అవసరాలకు అనుగుణంగా మొదటి అంతస్తులో ఓ చిన్నపాటి గది, గ్రౌండ్ భాగంలో ఓ హాలు నిర్మించారు. ఇందులోనే కార్యాలయం నిర్వాహణ కొనసాగుతోంది. ఫర్నిచర్, దస్త్రాలు, ఇతర సామగ్రి అన్ని ఇక్కడే పెట్టారు. దీంతో అధికారులు కూర్చోవడానికి అనువుగా లేకపోగా వివిధ అవసరాల కోసం వచ్చే రైతులు వెలుపలే నిలబడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ క్రమంలోనే సకల సౌకర్యాలతో కూడిన నూతన భవన నిర్మాణం కోసం రూ.50 లక్షలు కేటాయించారు. 2022 జనవరిలో అప్పటి మంత్రి హరీశ్‌రావు భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.

సీజన్లు గడుస్తున్నా..: భవనంలో ఏడీఏ, ఏవోల గదులు, సిబ్బంది గది, స్టోర్‌రూం, విశాలమైన హాలు నిర్మాణానికి డిజైన్ రూపొందించారు. అదే సంవత్సరం వ్యవసాయ సీజన్(జూన్) వరకు అందుబాటులోకి తెస్తామని ప్రకటించినప్పటికీ మూడు సీజన్లు గడిచినా పూర్తి చేయలేదు. కనీసం ఇప్పుడైనా అందుబాటులోకి వస్తుందని రైతులు, అధికారులు ఆశించినా ఫలితం లేదు.

ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం

ప్రభుత్వం కేటాయించిన నిధుల మేరకు పనులు పూర్తి చేశాం. మిగిలినవి పూర్తి చేసేందుకు అవసరమైన నిధుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. మంజూరైన వెంటనే కొనసాగిస్తాం. **-రాంచందర్, డీఈఈ పంచాయతీ రాజ్ శాఖ.**

మేమున్నాం.. మీకు తోడుగా..

సంగారెడ్డి 8008573233, జహీరాబాద్ 9441648363 నారాయణఖేడ్ 8008573248, నారాయణఖేడ్ టౌన్ 8008573250

అందోలు 8008573241, జిన్నారం 8008573231

(10AM TO 1 PM)

న్యూస్‌టుడే, నారాయణఖేడ్, జహీరాబాద్, జోగిపేట టౌన్, మనూరు

? ఖేడ్ నుంచి వివిధ మార్గాల్లో రాకపోకలు సాగించే బస్సులు సమయపాలన పాటించడం లేదు. దీంతో ప్రైవేటు వాహనాలలో వెళుతున్నాం. **- ప్రభాకర్, ఖేడ్**

✓ బస్సులు సమయానుసారం నడిచేలా చూస్తాం. **- మల్లేశయ్య, ఆర్టీసీ డీఎం, ఖేడ్**

? జహీరాబాద్‌లోని శాంతినగర్‌లో మిషన్ భగీరథ నీరు రాక కాలనీ వాసులు ఇబ్బంది పడుతున్నారు. **-రాములు, కాలనీ వాసి.**

✓ పరిశీలించి చర్యలు తీసుకుంటాం. **-ఉమామహేశ్వరరావు, కమిషనర్**

? పట్టణంలోని ప్రధాన రహదారి వెంట ఏర్పాటు చేసిన హైమాస్ట్ దీపాలలో కొన్ని వెలగడం లేదు. దీంతో రాత్రి వేళలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. **-చంద్రశేఖర్, జోగిపేట.**

✓ కొన్ని వెలగని విషయం వాస్తవమే. వాటిని తొలగించి కొత్తవి ఏర్పాటు చేయిస్తాం. **-తిరుపతి, కమిషనర్, అందోలు- జోగిపేట పురపాలిక.**

? నాగల్‌గిద్ద మండలం మావినేల్లి రోడ్డు అధ్వానంగా మారింది. అత్యవసర సమయాల్లో 108 వాహనం సైతం రావడం లేదు. **-బస్వరాజ్, మావినేల్లి**

✓ నిధులు మంజూరయ్యాయి. గుత్తేదారుతో మాట్లాడి బీటీ పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటాం. **-ప్రసాద్, పీఆర్ డిప్యూటీ ఈఈ**

? మనూరు మండలం ఎన్‌జీహోక్రానలో వైకుంఠధామం శిథిలావస్థకు చేరింది. గదులు బీటలు వారాయి. **-అర్జున్, ఎన్‌జీహోక్రాన**

✓ వైకుంఠధామం పరిశీలించి చర్యలు తీసుకుంటాం. **-హైమద్ హుస్సేన్, ఎంపీడీవో**

మినీ గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కల్హేర్, న్యూస్‌టుడే: గిరిజన సంక్షేమ మినీ గురుకుల బాలికల పాఠశాల బాచేపల్లిలో ఒకటి, ఐదో తరగతిలో ప్రవేశాల కోసం గిరిజన బాలికల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ శాఖ ప్రాంతీయ సమన్వయకర్త నాగార్జున రెడ్డి, పాఠశాల హెచ్‌ఎం కవిత ఒక ప్రకటనలో తెలిపారు. ఒకటో తరగతిలో 30, ఐదో తరగతిలో 16 ఖాళీలు ఉన్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల వారు సంబంధిత పాఠశాలలో జూన్ 6వ తేదీ సాయంత్రంలోపు దరఖాస్తులతో పాటు ఆధార్, రేషన్ కార్డు వంటి ధ్రువపత్రాలను పాఠశాలలో అందజేయాలన్నారు. ఎంపికలో సొంత మండలానికి చెందిన వారికే ప్రాధాన్యత ఇస్తామన్నారు. 9వ తేదీ ఉదయం 10 గంటలకు లాటరీ పద్ధతిలో ఎంపిక చేస్తామని, తుది జాబితాను పదో తేదీ ఉదయం పాఠశాల నోటీసు బోర్డుపై అందుబాటులో ఉంచుతామన్నారు.

3 నుంచి భూభారతి గ్రామసభలు

కల్హేర్, న్యూస్‌టుడే: నిజాంపేట్ మండలంలోని గ్రామాల్లో జూన్ 2వ తేదీ నుంచి 20వ తేదీ వరకు భూభారతి రెవెన్యూ గ్రామసభలను నిర్వహించనున్నట్లు తహసీల్దార్ నాగజ్యోతి తెలిపారు. జూన్ 3న జంబికుంట, 5, 6 తేదీల్లో ర్యాలమడుగు, 9, 10 తేదీల్లో బాచేపల్లి, 11, 12 తేదీల్లో మునిగేపల్లిలో భూ సమస్యలపై దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జిల్లా ఆసుపత్రిలో సదరం శిబిరం

సంగారెడ్డి అర్బన్, న్యూస్‌టుడే: జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో శుక్రవారం సదరం శిబిరం నిర్వహించామని ఆ ఆసుపత్రి పర్యవేక్షకులు అనిల్‌కుమార్ పేర్కొన్నారు. 50 మంది ఆన్‌లైన్‌లో స్లాట్ బుక్ చేసుకోగా.. 46 మంది దివ్యాంగులు శిబిరానికి హాజరయ్యారని తెలిపారు.

సోదరభావంతో మెలగాలి

హత్నూర, న్యూస్‌టుడే: బక్రీద్ వేడుకల్ని శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని జిన్నారం సీఐ నయీముద్దీన్ సూచించారు. హత్నూర పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. హిందూ ముస్లింలు సోదర భావంతో మెలగాలన్నారు. ఎస్సై శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు

లేబర్ కోడ్‌ల రద్దుకు పోరాటం

జెండాను ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

ఖాజీపల్లి(జిన్నారం), నారాయణఖేడ్, గుమ్మడిదల, సంగారెడ్డి టౌన్, న్యూస్‌టుడే: లేబర్ కోడ్‌లను రద్దు చేసే వరకు పోరాటం కొనసాగిస్తామని సీఐటీయూ నాయకులు స్పష్టం చేశారు. శుక్రవారం ఖాజీపల్లి పారిశ్రామిక వాడలోని టీఐడీసీ పరిశ్రమ ఎదుట సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు వీరభద్రం, జె.శ్రీనివాస్, సుధాకర్‌గౌడ్, టి.శ్రీరాములు, ప్రభాకర్‌రావు, సుదర్శన్‌కుమార్, జైపాల్ పాల్గొన్నారు. ఖేడ్‌లో డివిజన్ కార్యదర్శి రమేష్ సీఐటీయూ జెండా ఆవిష్కరించారు. పురపాలిక కార్మిక సంఘం అధ్యక్షురాలు శకుంతల, సిద్ధమ్మ, రవి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. బొంతపల్లి న్యూల్యాండ్ పరిశ్రమ వద్ద జరిగిన కార్యక్రమంలో శ్రీధర్‌రావు పాల్గొన్నారు. సంగారెడ్డిలోని సుందరయ్య భవన్ వద్ద సంఘం జిల్లా అధ్యక్షుడు మల్లేశం సీఐటీయూ జెండాను ఎగురవేశారు.

రాజీవ్ యువ వికాసంపై బ్యాంకర్లతో సమీక్ష

హత్నూర, న్యూస్‌టుడే: నిరుద్యోగ యువతీయువకులకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించడానికి ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం పథకం అమలు చేస్తుందని జడ్పీ డిప్యూటీ సీఈవో స్వప్న పేర్కొన్నారు. హత్నూరలో శుక్రవారం బ్యాంకర్లతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా ఉండాలని, అర్హులైన నిరుపేదలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శంకర్, ఎంపీవో యూసుఫ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రిపై చర్యలు తీసుకోవాలి: సీపీఎం

సంగారెడ్డి అర్బన్, న్యూస్‌టుడే: మహిళ మృతికి కారణమైన ఆసుపత్రి యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా ఇన్‌ఛార్జి వైద్యాధికారిణి గాయత్రీదేవికి వినతిపత్రం అందించారు. సదాశివపేటలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో వైద్యుల నిర్లక్ష్యం వల్ల గురువారం మహిళ మృతి చెందారని ఆరోపించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు అతిమేల మాణిక్యం, సదాశివపేట సీపీఎం ఏరియా కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర మార్గం.. ఆగమాగం

తెలంగాణ-కర్ణాటక రాష్ట్రాల మధ్య రాకపోకలు సాగించే ప్రధాన రహదారి ఇది. నాగల్‌గిద్ద మండలం మోర్గి శివారులో వాగుపై కొన్నేళ్ల క్రితం నిర్మించిన వంతెన ప్రమాదకరంగా మారింది. ఇనుప చువ్వలు తేలి గుంతలమయంగా మారింది. దీంతో ఈ మార్గంలో వాహనచోదకులు తరచూ అదుపుతప్పి కింద పడి గాయపడుతున్నారు. రాత్రి వేళలో గుంతలు, ఇనుప చువ్వలు కనిపించడం లేదని వాపోతున్నారు. ఇకనైనా మరమ్మతులు చేయించాలని ప్రయాణికులు కోరుతున్నారు. **-న్యూస్‌టుడే, మనూరు.**

గుంతల రహదారి పరిశీలన

అల్గోల్ కూడలిలో రోడ్డుపై గుంతలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మాణిక్ రావు

జహీరాబాద్, న్యూస్‌టుడే: జహీరాబాద్ శివారు బైపాస్ కూడలి నుంచి అల్గోల్ వెళ్లే ప్రధాన రహదారి గుంతలమయంగా మారి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలోనే 'ఈనాడు'లో శుక్రవారం 'పడుతూ..లేస్తూ..ప్రయాణిస్తూ' అనే శీర్షికన ప్రచురితమైన చిత్ర కథనానికి ఎమ్మెల్యే కె.మాణిక్‌రావు స్పందించారు. అధికారులు, భారాస శ్రేణులతో కలిసి రోడ్డును పరిశీలించి ప్రజలతో మాట్లాడి బాధలు తెలుసుకున్నారు. అక్కడి నుంచే ఆర్ అండ్ బీ ఎస్ఈ, ఈఈలతో మాట్లాడారు. సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరారు.

విద్యార్థులకు ప్రయోగాత్మకంగా బోధించాలి: ఎమ్మెల్సీ

మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అంజిరెడ్డి

సంగారెడ్డి మున్సిపాలిటీ, న్యూస్‌టుడే: సైన్స్ ఉపాధ్యాయులు విద్యార్థులకు అర్థమయ్యేలా ప్రయోగాత్మకంగా బోధించాలని ఎమ్మెల్సీ అంజిరెడ్డి సూచించారు. సంగారెడ్డిలో నిర్వహిస్తున్న సైన్స్ ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యార్థులకు సైన్స్‌పై ఆసక్తి కలిగేలా బోధన చేయాలన్నారు. సమావేశంలో ఏఎంవో బాలయ్య, ప్లానింగ్ సమన్వయకర్త తాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్సీలో పాఠ్య పుస్తకాల పంపిణీ

ఝరాసంగం, న్యూస్‌టుడే: పాఠశాలల పునఃప్రారంభానికి ముందే పాఠ్య పుస్తకాల పంపిణీ ప్రక్రియ ప్రారంభమైంది. శుక్రవారం ఝరాసంగం ఎమ్మార్సీ కార్యాలయానికి మండలంలోని వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు వచ్చి పాఠ్యపుస్తకాలను తీసుకెళ్లారు. మండలంలో 2,663 మంది విద్యార్థులుండగా 4 వేల పుస్తకాలను పంపిణీ చేశామని ఎంఈవో శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో సీఆర్పీలు రాజు తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ బడుల బలోపేతానికి ప్రాధాన్యం

సంగారెడ్డి అర్బన్, న్యూస్‌టుడే: ప్రభుత్వ బడుల బలోపేతానికి ప్రాధాన్యం ఇస్తామని ఎద్దుమైలారం జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జోగప్ప పేర్కొన్నారు. శుక్రవారం బడిబాటలో భాగంగా కంది మండలం ఎద్దుమైలారంలో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు హరికృష్ణ, నర్సింలు, వనజ, వహీద్‌పాషా, వినీల తదితరులు పాల్గొన్నారు.

కప్పతారా.. పడేస్తారా..

గడ్డపోతారం పురపాలిక కార్యాలయం ఎదుటే ప్రమాదం పొంచి ఉంది. కార్యాలయం ముందు భాగంలో జడ్పీ పాఠశాలకు ఆనుకొని ఉన్న మురుగు కాలువపై కొంత మేర ఫైకప్పు వేయలేదు. ఇక్కడే వాహనాలు పార్కింగ్ చేస్తారు. సందర్శకులు తిరిగే ప్రాంతం ఇదే. వర్షం భారీగా కురిస్తే చిన్నారులు కొట్టుకుపోయేంత నీటి ప్రవాహం వస్తుంది. అయినా రక్షణ చర్యలు లేకుండానే డ్రైనేజీని ఇలా నిర్లక్ష్యంగా వదిలేశారు. అధికారులు సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు. **-న్యూస్‌టుడే, జిన్నారం**

గోరక్షణ చట్టం అమలు చేయాలి

పుల్కల్, న్యూస్‌టుడే: గోవుల అక్రమ రవాణాను అడ్డుకోవాలని బజరంగ్‌దళ్ జిల్లా సంయోజక్ ప్రభుకుమార్ గౌడ్ డిమాండు చేశారు. ఈ మేరకు సంఘ ప్రతినిధులతో కలిసి శుక్రవారం మండల కేంద్రంలో ఎస్సై పాటిల్ క్రాంతికుమార్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ.. తాడ్దాన్‌పల్లి టోల్‌ప్లాజా వద్ద చెక్‌పోస్టు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీకాంత్, మనోహర్‌గౌడ్, చంద్రశేఖర్, సంతోష్, దత్తాత్రేయ, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సైకి వినతి పత్రం అందజేస్తున్న ప్రతినిధులు

ఉచిత వైద్య సేవలు అభినందనీయం: ఎమ్మెల్యే

సదాశివపేట: ఉచిత వైద్య సేవలు అభినందనీయమని సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ పేర్కొన్నారు. సదాశివపేటలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఉచిత వైద్య శిబిరాలతో పేదలకు మేలు జరుగుతుందన్నారు. టీజీఐఐసీ ఛైర్‌పర్సన్ నిర్మలారెడ్డి మాట్లాడుతూ.. క్లబ్‌కు తనవంతు సహకారం ఉంటుందన్నారు. క్లబ్ బాధ్యుడు రాజశేఖర్, వైద్యులు వెంకటరంగారెడ్డి, శివకుమార్, కిషోర్‌కుమార్, చంద్రశేఖర్, మాధవీలత పాల్గొన్నారు.

నేటి నుంచి ప్రతిష్ఠాపనోత్సవాలు

బొంతపల్లి(గుమ్మడిదల), న్యూస్‌టుడే: బొంతపల్లిలో శనివారం నుంచి జూన్ 2వ తేదీ వరకు మూడు దేవాలయాల్లో అమ్మవార్ల విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు గ్రామ దేవాలయ కమిటీ ఛైర్మన్ కావలి శంకర్ యాదవ్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం కార్యక్రమాల ఏర్పాట్లపై గ్రామ పెద్దలతో కలిసి పర్యవేక్షించారు.

ఇందిరమ్మ గృహాల ఎంపికపై ఆందోళన

అధికారుల తీరుపై నిరసన తెలుపుతున్న గ్రామస్థులు

బొంతపల్లి (గుమ్మడిదల), న్యూస్‌టుడే: ఇందిరమ్మ ఇళ్ల విషయంలో అధికారులు బొంతపల్లి పురపాలిక వార్డుకు అన్యాయం చేశారంటూ గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం భూమిపూజకు వచ్చిన అధికారులను నిలదీశారు. బొంతపల్లిలో 7 వేల జనాభా ఉన్నా గుమ్మడిదల పురపాలికలో కలిపారని, ఇళ్ల ఎంపికపై సర్వే సరిగా నిర్వహించలేదని కార్యాలయం ఎదుట బైఠాయించారు. నినాదాలు చేశారు. దీంతో అధికారులు భూమి పూజ కార్యక్రమం వాయిదా వేసి వెళ్లిపోయారు. తమకు న్యాయం చేసే వరకు అధికారులను గ్రామంలోకి రానివ్వమని స్పష్టం చేశారు.

నేడు దిగ్వాల్‌లో మైసమ్మ జాతర

దిగ్వాల్(కోహీర్), న్యూస్‌టుడే: మండల పరిధి దిగ్వాల్ శివారులోని లేతమామిళ్ల చెరువు వద్ద వెలసిన మైసమ్మ తల్లి జాతర ఉత్సవాలు శనివారం ప్రారంభం కానున్నాయి. మూడు రోజుల పాటు కార్యక్రమాలు కొనసాగుతాయని నిర్వాహకులు తెలిపారు. ఇందుకు సంబంధించి ఏర్పాట్లు చేశామన్నారు. భక్తులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు.

షాద్‌నగర్‌లో భూ సర్వే

వట్‌పల్లి: పైలెట్ ప్రాజెక్టు భూ సర్వేలో భాగంగా షాద్‌నగర్ శివారులో శుక్రవారం సర్వే నిర్వహించినట్లు ఇన్‌ఛార్జి సర్వేయర్ మురళీధర్ తెలిపారు. సర్వే చేసేటప్పుడు రైతులు అందుబాటులో ఉండి సహకరించాలని కోరారు.

ప్రజల భాగస్వామ్యంతో గ్రామాభివృద్ధి

వట్‌పల్లి: స్థానిక ప్రజల భాగస్వామ్యంతో గ్రామాభివృద్ధి సాధ్యమవుతుందని ఎంపీపీ ఖాజా నసీరుద్దీన్ అన్నారు. మర్వెల్లిలో శుక్రవారం పంచాయతీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. అందుబాటులో ఉన్న నిధులతో పారిశుద్ధ్యంతో పాటు ఇతర పనులు కొనసాగిస్తున్నట్లు తెలిపారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి

వట్‌పల్లి, న్యూస్‌టుడే: గిరిజన తండాల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తుందని మాజీ ఎంపీపీ పత్రి విఠల్ అన్నారు. లక్ష్మీదేవి తండాలో శుక్రవారం బోరు బావి తవ్వే పనులు ప్రారంభించారు. గ్రామీణ తాగు నీటి సరఫరా విభాగం నుంచి రూ.2 లక్షల నిధులు మంజూరు కావడంతో బోరు బావి తవ్విస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఈశ్వరప్ప, వీరునాయక్, విష్ణువర్ధన్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

రాయితీపై విత్తనాలు అందజేయండి

ఝరాసంగం, న్యూస్‌టుడే: రైతులకు అవసరమయ్యే విత్తనాలను రాయితీపై అందజేయాలని భాజపా మండల అధ్యక్షుడు విశ్వనాథ్ ఒక ప్రకటనలో కోరారు. ఖరీఫ్ సీజన్‌లో సోయాబీన్, పత్తి, జనుము, పెసర, మినుము విత్తనాలను వ్యవసాయశాఖ అధికారులు రైతులకు అందుబాటులో ఉంచాలన్నారు.

వేతనాలు ఎప్పుడొస్తాయో?



జిల్లా విద్యాధికారి కార్యాలయం

డీఎస్సీ-2008 ఉపాధ్యాయుల ఎదురుచూపులు

న్యూస్‌టుడే, సంగారెడ్డి మున్సిపాలిటీ: డీఎస్సీ-2008 పరీక్ష రాసిన అభ్యర్థులు ఫలితాలు వచ్చిన 16 సంవత్సరాల తరువాత విధుల్లో చేరారు. రెగ్యులర్‌గా కాకుండా కాంట్రాక్టు పద్ధతిన పోస్టింగ్ ఇచ్చిన తమకు నచ్చిన ఉపాధ్యాయ ఉద్యోగమని ఇష్టంతో వచ్చారు. జనవరిలో విధుల్లో చేరగా ఇప్పటి వరకు ఒక్క నెల జీతం కూడా రాలేదు. దీంతో కొలువులు వచ్చాయనే సంబరం కంటే జీతాలు ఎప్పుడొస్తాయోనని ఎదురుచూపులు చూడాల్సిన పరిస్థితి నెలకొంది. వేతనాలు ఇప్పించాలని అధికారులకు విన్నవించినా స్పందన లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

డీఎస్సీ-2008లో భాగంగా జిల్లాలో జనవరిలో 67 మంది ఉపాధ్యాయులు కాంట్రాక్టు పద్ధతిన చేరారు. వీరికి నెలకు రూ.31,040 చొప్పున గౌరవ వేతనం అందిస్తామని నియామక పత్రంలో పేర్కొన్నారు. విద్యా సంవత్సరం ముగిసి నెలలు వచ్చినా ఇప్పటి వరకు వేతనాలు రాలేదు. మరో 13 రోజుల్లో కొత్త విద్యా సంవత్సరం ప్రారంభం కానుంది. గతేడాదికి సంబంధించిన నాలుగు నెలల వేతనాలు రావాల్సి ఉంది. దీంతో అప్పులు చేసి కుటుంబాన్ని నెట్టుకొస్తున్నామని ఉపాధ్యాయులు చెబుతున్నారు. వీరు ఐదు రోజుల ఉపాధ్యాయ శిక్షణకు కూడా హాజరవుతున్నారు. మళ్లీ పాఠశాలలు పునఃప్రారంభం అయ్యేలోపు వేతనాలు ఇవ్వకుంటే ఆర్థికంగా మరిన్ని ఇబ్బందులు పడతామని పేర్కొన్నారు. అధికారులు స్పందించాలని కోరుతున్నారు.

ఉన్నతాధికారులకు నివేదించాం

డీఎస్సీ-2008 ఉపాధ్యాయులకు నాలుగు నెలల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయి. ఇందుకు సంబంధించి ఉన్నతాధికారులకు నివేదించాం. బడ్జెట్ విడుదల అయితే నేరుగా వారి ఖాతాలో జమ చేస్తాం. **-వెంకటేశ్వర్లు, జిల్లా విద్యాధికారి.**

సాగులో మెలకువలపై అవగాహన

న్యాల్‌కల్, న్యూస్‌టుడే: వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్‌లో భాగంగా మండలంలోని మామిడ్గి రైతు వేదిక, మెటల్‌కుంట, గంగ్వార గ్రామాల్లో శుక్రవారం రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా కె.వి.కె సంగారెడ్డి జిల్లా నోడల్ అధికారి డా.వరప్రసాద్ మాట్లాడుతూ.. సంతులిత ఆహారం, భూసార పరీక్షలు, పంటల విస్తీర్ణం, ఎరువులు, తెగుళ్లు, పశు సంరక్షణ, పోషణ గురించి వివరించారు. రైతులందరూ యూనిక్ ఐడీ కార్డులు పొందాలని మండల వ్యవసాయాధికారి అవినాష్ వర్మ తెలిపారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డా.సాయి ప్రియాంక, కైలాష్, స్నేహలత, రమేష్, హేమలత, స్వామి, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

బోరు మోటారుకు మరమ్మతులు

కల్హేర్, న్యూస్‌టుడే: కల్హేర్ మండలంలోని బీబీపేట్ గ్రామంలో నిలిచిపోయిన తాగునీటి సరఫరాను అధికారులు శుక్రవారం పునరుద్ధరించారు. బోరు మోటారు చెడిపోయి వారం రోజులుగా తాగు నీటి సరఫరాకు అంతరాయం కలిగింది. దీంతో 1, 2, 3 వార్డులకు చెందిన మహిళలు గురువారం ఖాళీ బిందెలతో పంచాయతీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. స్పందించిన కార్యదర్శి నరేష్ బోరు మోటార్‌కు మరమ్మతులు చేయించి సమస్య పరిష్కరించారు.

OMKARA ASSETS RECONSTRUCTION Pvt. Ltd.

ఓంకార అసెట్స్ రీకన్‌స్ట్రక్షన్ ప్రైవేట్ లిమిటెడ్

కార్పొరేట్ కార్యాలయం: కొహినూర్ స్క్వేర్, 47వ అంతస్తు, ఎన్.సి. కేల్కర్ మార్గ్, ఆర్.జి.గడ్కరీ చౌక్, దాదర్ (వెస్ట్), ముంబయి-400028. ఫోన్: 022-6923 1111 ఇమెయిల్: ritesh.sawant@omkaraarc.com | www.omkaraarc.com | సీఐఎన్: U67100TZ2014PTC020363

ప్రకటన

ఇందులోని అన్ని హక్కులు, టైటిల్, ప్రయోజనాలు మరియు ఉపరితలాన్నంటిలోనూ ఇంతవుతున్న సెక్యూరిటీలన్నింటితోపాటు BPL ఇంజనీరింగ్ లిమిటెడ్ (తర్వాత్తినిలో ఉన్నవిగా) మీయొగాయంకోబడిన సమపాయాలకు సంబంధించి, వరే మరియు స్థిర ఆస్తుల విక్రయానికి ప్రచురించబడిన 15 మే 2025 తేదీ నాటి ఇ-వేలం అమ్మకపు ప్రకటనను చూడగలరు.

సరసు ఇ-వేలం అమ్మకం ప్రకటనలో తెలిపిన సెక్యూర్డ్ అసెట్ కొరకు షెడ్యూలు చేయబడిన ఇ-వేలం ఇప్పుడు 31 మే 2025 నుండి 06 జూన్ 2025 వరకు రీ-షెడ్యూలు చేయబడినవి. పై విషయాన్ని దృష్టిలో ఉంచుకొని మార్పు చేయబడిన సమయ పట్టికను గమనించగలరు.

వీడ్ డాలుకు చివరి తేది	05 జూన్ 2025 (గురువారం) సా.5.00 గం.లోగా.
వేలం తేది	06 జూన్ 2025 (శుక్రవారం) ప.3.00 గం. నుండి ప.4.00 గం.వరకు.
తనిఖీ తేది	ఆక్షర్తుగల ప్రకారం

అమ్మకం యొక్క మార్పు చేయబడిన నియమ నిబంధనలు: https://omkaraarc.com/auction.phpలో తెలుపబడినవి. పైన బిడ్డర్ కు ప్రకటనలో తెలుపబడినవి మినహా, 15-05-2025 తేదీ నాటి ఇ-వేలం ప్రకటనలోని మిగిలిన వివరాలు యథాతథం. ఇందులోని తప్పు ప్రమాణాలకు మార్పులుచేయబడ్డవు, చెక్కులెదరవు మరియు మార్పులుడవు.

తేది: 31-05-2025 సం/-

ప్రదేశం: మెదక్, తెలంగాణ